క్లుప్తంగా

పెద్దింటి అమ్మకు శ్రావణ సారె సమర్పణ



అమ్మవారికి శ్రావణ సారె సమర్పిస్తున్న వెలంపేట మహిళలు

ఆకివీడు: స్థానిక పెద్దింటి అమ్మవారికి శ్రావణ మాస సారెను ఆదివారం వెలంపేట మహిళలు సమర్పించారు. వెలంపేట రామాలయం నుంచి మహిళలు సన్నాయి, డప్పు వాయిద్యాలతో, చలివిడి, పానకాలు నింపిన బిందెల కావిడులతో ఊరేగింపుగా మహిళలు ఆలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మర్యాదలతో వారిని సత్కరించారు.

వాండ్రంలో శాంతియుత వాతావరణం నెలకొల్పాలి



డీఎస్పీ శ్రీనాథ్‌కు వినతిపత్రం అందజేస్తున్న మంగరాజు

సాక్షి, భీమవరం: ఉండి మండలం వాండ్రం గ్రామంలో శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ సి.మంగరాజు కోరారు. భీమవరం డీఎస్పీ బి.శ్రీనాథ్‌ను ఆదివారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. అల్లర్లకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. శాంతి భద్రతలను పరిరక్షించి, బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

ఆదిశంకరాచార్య విగ్రహం ఏర్పాటు



ఆచంట రామేశ్వర స్వామి దేవస్థానంలో ఏర్పాటు చేసిన శంకరాచార్య విగ్రహం

పెనుగొండ: ఆచంటేశ్వరుని ఆలయంలో ఆదివారం జగద్గురు ఆదిశంకరాచార్య విగ్రహావిష్కరణ అత్యంత వైభవంగా ఆవిష్కరించారు. మృత్యుంజయ సొసైటీ మాజీ అధ్యక్షురాలు, దివంగత వైట్ల శారదా దేవి జ్ఞాపకార్థం వారి కుమారుడు వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించిన విగ్రహావిష్కరణ చేశారు. కార్యక్రమంలో బాలిన వీరాస్వామి, మనవర్తి శ్రీను, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.


బీచ్‌లో సందర్శకుల సందడి



కేపీ పాలెం బీచ్‌లో సేదతీరుతున్న సందర్శకులు

మొగల్తూరు: కేపీ పాలెం బీచ్‌కు ఆదివారం పర్యాటకులు తరలివచ్చారు. ఉదయం నుంచి వేసవిని తలపించేలా ఎండలు కాయడంతో పర్యాటకులు పర్యాటకులు సముద్ర స్నానం చేస్తూ ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. అనంతరం తీరంలోని వేంకటేశ్వరస్వామి, వేలాంకణీ మాత,పాండురంగ స్వామి, 54 అడుగుల అభయాంజనేయ స్వామి, షిర్డీ సాయిబాబా, అష్టలక్ష్మి ఆలయాలను దర్శించుకున్నారు.

జగనన్న ప్రభుత్వంలోనే హాస్టళ్ల అభివృద్ధి



పరిమెళ్లలోని ఎస్సీ బాలుర హాస్టల్‌ను సందర్శించిన చీకటిమిల్లి మంగరాజు

పెంటపాడు: జగనన్న ప్రభుత్వంలోనే ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లలో సంక్షేమం, అభివృద్ధి జరుగుతోందని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు డాక్టర్ చీకటిమిల్లి మంగరాజు అన్నారు. ఆదివారం ఆయన పరిమెళ్లలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహ విద్యార్థులతో ఆయన మాట్లాడారు. పరిసరాలను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం ఎలా ఉంటోంది. బాత్‌రూమ్‌లు సరిగా ఉంటున్నాయా, రగ్గులు, పుస్తకాలు, కాస్మొటిక్స్ ఇతర సౌకర్యాలపై విద్యార్థులను ఆరా తీశారు. విద్యార్థులు సంతృప్తికర సమాధానాలు చెప్పడంతో హర్షం వ్యక్తం చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఎన్నో సమస్యలు ఉండేవన్నారు. నేడు జగనన్న అభివృద్ధి, సంక్షేమం పేరిట విద్యా వ్యవస్థలో నాడు-నేడు పథకం ద్వారా సమూల మార్పులు తీసుకురావడంతో పాటు, అమ్మఒడి, వసతి దీవెన తదితర పథకాల పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్, కుక్, కమాటి సిబ్బంది పాల్గొన్నారు.

ఉప ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీకే పట్టు

భీమవరం, ఉండి నియోజకవర్గాల్లో పంచాయతీ ఉప ఎన్నిక ఫలితాల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారులు విజయకేతనం ఎగురవేయడం పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం వెల్లివిరుస్తోంది. ఈ ఎన్నికల ఫలితాలతో రెండు నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీకే పట్టు ఉందనేది మరోసారి రుజువైంది. ఈ నియోజకవర్గాల్లోని మొత్తం ఐదు గ్రామాల్లో ఆరు వార్డు సభ్యుల పదవులకు ఉప ఎన్నిక జరగ్గా, ఐదు చోట్ల వైఎస్సార్ సీపీ మద్దతుదారులు విజయం సాధించారు. వీటిలో వీరవాసరం మండలం మత్స్యపురి, పాలకోడేరు మండలం ..గ్రామంలో వైఎస్సార్ సీపీ, టీడీపీ మద్దతుతో బరిలోకి దిగిన అభ్యర్థుల మధ్య పోరు ఆసక్తికరంగా జరగ్గా, వైఎస్సార్ సీపీ మద్దతు ఇచ్చిన అభ్యర్థులనే విజయం వరించింది.

- భీమవరం, ఉండి నియోజకవర్గాల్లో మొత్తం 6 వార్డులకు ఐదు కైవసం
- మత్స్యపురి, గొల్లలకోడేరులో హోరాహోరీగా పోరు..
- 3 వార్డులు ఏకగ్రీవం



అజ్జమూరు 10వ వార్డు సభ్యురాలిగా ఏకగ్రీవంగా ఎన్నికైన బుంగా శాంతకుమారి, కలిసిపూడి 3వ వార్డుకు ఏకగ్రీవంగా ఎన్నికైన చింతమ్మ, గొల్లలకోడేరు 6వ వార్డులో విజయం సాధించిన నాగమణి, మత్స్యపురి 1వ వార్డు మెంబర్‌గా గెలుపొందిన కారేపల్లి విజయలక్ష్మి

ఆకివీడు: పంచాయతీ వార్డు సభ్యుల ఉప ఎన్నికలో గ్రామాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని, గ్రామ పెద్దల నిర్ణయంతో ఆయా గ్రామాల్లో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. ఆకివీడు మండలం అజ్జమూరు గ్రామంలోని 10వ వార్డు సభ్యురాలిగా బుంగా శాంతకుమారి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. వార్డు సభ్యుడుగా ఉన్న బుంగా రామారావు గుండె పోటుతో మృతి చెందారు. దీంతో ఆయన భార్య శాంతకుమారిని వైఎస్సార్ సీపీ నాయకులు ఎన్నికల బరిలోకి దించారు. అయితే గ్రామంలోని టీడీపీ, జనసేన నాయకులు పోటీకి సిద్ధం కావడంతో వైఎస్సార్ సీపీ నాయకులు, పెద్దలు నచ్చజెప్పడంతో పోటీ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నారు. దీంతో శాంతకుమారి నామినేషన్ ఒక్కటే దాఖలు కావడంతో ఆమె ఎన్నిక ఏకగ్రీవమైంది. అలాగే కుప్పనపూడి గ్రామంలోని 2, 7 వార్డు సభ్యుల మృతితో ఎన్నిక జరుగగా పోటీకి వైఎస్సార్ సీపీతో పాటు టీడీపీ ముందుకు వచ్చింది. దీంతో వార్డు సభ్యుడి పోటీ తీవ్రంగా జరిగే అవకాశం ఉందని, డబ్బు వృథా అవుతుందని భావించిన గ్రామ పెద్దలు టీడీపీ అభ్యర్థి మద్దిశెట్టి లక్ష్మికి ఏడో వార్డు, వైఎస్సార్ సీపీ మద్దతిచ్చిన అభ్యర్థి కట్రెడ్డి సుబ్బారావుకు రెండో వార్డును కేటాయించడంతో రెండు వార్డు సభ్యుల ఎన్నిక ఏకగ్రీవమైంది. ఆయా వార్డులకు మొత్తం నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. పెద్దల అంగీకారంతో మిగిలిన అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. ఈ రెండింటిల్లో మృతుల కుటుంబాలకు చెందిన వారికే ప్రాధాన్యత ఇచ్చారు. ఉండి మండలంలోని కలిసిపూడి గ్రామంలోని 3వ వార్డు సభ్యుడు ఇస్రాయేలు మృతితో ఎన్నిక జరుగగా, ఆయన భార్య కొక్కిరి చింతమ్మను అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ బలపర్చింది. పోటీకి ఇద్దరు ఇండిపెండెంట్‌లు రంగంలోకి దిగగా గ్రామ పెద్దల జోక్యంతో వారు తమ నామినేషన్లు ఉపసంహరించుకోవడంతో చింతమ్మ ఎన్నిక ఏకగ్రీవమైంది. పాలకోడేరు మండలం గొల్లలకోడేరు 6వ వార్డులో టీడీపీ, వైఎస్సార్ సీపీలు మద్దతుదారులు బరిలో నిలిచారు. హోరాహోరీగా జరిగిన ఈ పోటీలో 42 ఓట్ల మెజార్టీతో వైఎస్సార్ సీపీ అభ్యర్థి సంబలదీవి నాగమణి విజయం సాధించారు.

మత్స్యపురిలో 160 ఓట్ల మెజార్టీ

వీరవాసరం: పంచాయతీ ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపర్చిన అభ్యర్థి ఘన విజయం సాధించారు. వీరవాసరం మండలం మత్స్యపురి గ్రామంలో 1వ వార్డుకు నిర్వహించిన పోలింగ్‌లో మొత్తం 292 ఓట్లకు గాను 234 ఓట్లు పోలయ్యాయి. వీటిలో వైఎస్సార్ సీపీ బలపర్చిన అభ్యర్థి కారేపల్లి విజయలక్ష్మికి 197 ఓట్లు రాగా, బీజేపీ, తెలుగుదేశం, జనసేన పార్టీలు ఉమ్మడి అభ్యర్థిగా బలపరిచిన కారేపల్లి కమలకుమారికి కేవలం 37 ఓట్లు మాత్రమే వచ్చాయి. 160 ఓట్ల మెజార్టీతో కారేపల్లి విజయలక్ష్మి గెలుపొందారు.

22న శాంతి ర్యాలీ

పాలకోడేరు: మణిపూర్‌లో శాంతి భద్రతలు రక్షించాలని కోరుతూ మంగళవారం శాంతి ర్యాలీ నిర్వహిస్తామని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు పొన్నమండ బాలకృష్ణ ఆదివారం చెప్పారు. మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు యూపీఏ అసోసియేషన్ ఆధ్వర్యంలో గొల్లలకోడరు వంతెన దగ్గర నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు శాంతి ర్యాలీ నిర్వహించి అనంతరం తహసిల్దార్‌కు వినతిపత్రం ఇస్తామన్నారు. ఈ మేరకు ఆదివారం శాంతి ర్యాలీ పోస్టర్లను, గొరగనమూడి సెయింట్ జోసెఫ్ లూథరన్ చర్చిలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాస్టర్ నికోలస్, మట్టా రాజేష్, తులసి చంద్రమోహన్, గోడి రమేష్‌బాబు, పితాని పద్మనాభం, గంటా చిన్నజయ పాల్గొన్నారు.

కుముదవల్లిలో శాంతి ర్యాలీ

పాలకోడేరు: మణిపూర్‌లో గిరిజన క్రైస్తవులపై జరుగుతున్న హింసాకాండను కేంద్ర ప్రభుత్వం వెంటనే అదుపు చేయాలని, అక్కడ గిరిజన క్రైస్తవులకు రక్షణ కల్పించాలని దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం పాలకోడేరు మండలం కుముదవల్లి గ్రామం సాల్మన్‌పేటలో శాంతి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గంటా సుందర్‌కుమార్, పాలపర్తి జోనా, అలిపే సుందర్ సింగ్, గల్లి సత్యానందం, జి.యాకోబు, దొడ్డి దానియేల్, అంబటి ఆనంద్‌కుమార్ తెలిపారు.

వ్యవసాయం, ఆక్వాకు అధిక ప్రాధాన్యం

- డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు
- చినపుల్లేరులో వంతెన ప్రారంభం



చినపుల్లేరులో వంతెన ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఉండి: వ్యవసాయం, ఆక్వా సాగుకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వమేనని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. ఆదివారం చినపుల్లేరు శివారు మంగలకోడుపై రైతులు స్వచ్ఛందంగా రూ.10 లక్షలతో నిర్మించుకున్న వంతెనను రైతుల కోరిక మీదట పీవీఎల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయానికి, ఆక్వాకు మద్దతుగా నిలిచి వారి కోసం రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. రైతుకు నష్టం కలిగితే వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం ముందు ఉంటోందన్నారు. అధికారం చేపట్టిన వెంటనే రైతులకు వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.13,500 సాయం అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వ్యవసాయం దండగ అని చంద్రబాబు, ఇతర పెద్దమనుషుల హేళనగా మాట్లాడినా రైతులకు వ్యవసాయం పండగ చేసిన నాయకుడు సీఎం వైఎస్ జగన్ మాత్రమేనన్నారు. రైతులకు తక్కువ ధరకు ఎరువులు, పురుగుమందులు గ్రామంలోనే రైతు భరోసా కేంద్రాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందన్నారు. సబ్సిడీపై విత్తనాలు, విపత్తు సమయాల్లో ఇన్‌పుట్ సబ్సిడీ, నష్టపరిహారం వంటివి పూర్తిస్థాయిలో అందిస్తోందన్నారు. అలాగే పూర్తి స్థాయిలో పంటకు మద్దతు ధరను అందించి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రతి గింజను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్నారు. ఆక్వా సాగుకోసం నడుంబిగించి కరోనా కష్ట సమయంలో రైతులకు అండగా నిలిచిన జగన్‌మోహన్‌రెడ్డిని రైతులు గుండెల్లో పెట్టుకున్నారన్నారు. సీడ్ ధరలు తగ్గించి, నాణ్యమైన సీడ్ అందించడం, కౌంట్ ధరలు పెంచడం వంటివి చేసి గత కరోనా కాలం నుంచి ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం ఆక్వా రైతుకు అండగా నిలిచిందన్నారు. ముఖ్యంగా పదెకరాల లోపు రైతులకు రూ.1.50కే యూనిట్ విద్యుత్‌ను సబ్సిడీపై అందించి వారికి మరింత దన్నుగా నిలిచిందన్నారు. గ్రామ సర్పంచ్ పెన్మత్స సావిత్రమ్మ, పెన్మత్స రామరాజు, కాళ్ల జడ్పీటీసీ సభ్యులు పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు, బొండాడ సర్పంచ్ గోళ్ళ పండు, వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు బొర్రా వెంకన్న (తాతయ్య), బొర్రా సుబ్బారావు, బొర్రా వెంకటేశ్వరరావు, అల్లూరి చంద్రరాజు, అంజనేయులు, గుడ్ల గొల్లయ్య, బొర్రా రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

22న పిల్లలకు ఉచిత గుండె వైద్య శిబిరం

భీమవరం (ప్రకాశంచౌక్): మేంటీవారి తోటలోని అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం)లో ఈ నెల 22న పిల్లల గుండె సంబంధిత వ్యాధులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడకు చెందిన పిల్లల గుండె వైద్య నిపుణులు డాక్టర్ కె.విక్రమ్ (ఇంటర్ వెన్షనల్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్) 15 ఏళ్ల లోపు పిల్లలకు ఉచిత వైద్య పరీక్షలు, చికిత్సకు వైద్య సహాయం అందిస్తారని తెలిపారు. వైద్య శిబిరాన్ని భీమవరం, చుట్టు పక్కల ప్రాంతాల వారు వినియోగించుకోవాలని కోరారు. వసుధ ఫౌండేషన్, ఎస్ఎల్‌జీ హాస్పిటల్స్, మానవతా తదితర స్వచ్ఛంద సంస్థలు ఈ కార్యక్రమంలో పాల్గొని వైద్య సహాయం అందిస్తాయన్నారు. ఇతర వివరాల కోసం 99490 93115, 9440859700 నంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

దిగివచ్చిన టమాటా ధర



ధర తగ్గిన టమాటాలు

పాలకోడేరు: సామాన్యుడికి టమాటా ధరలు అందుబాటులోకి వచ్చాయి. మండలంలోని మోగల్లు, శృంగవృక్షం గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన వారపు సంతలో ఈ వారం కూరగాయలు ధరలు సామాన్యుడికి అందుబాటులోనే ఉన్నాయి. నిన్నటి వరకు కిలో రూ.160 నుంచి రూ.200 వరకు ధర పలికిన టమాటాలు ఆదివారం కిలో రూ.50కి ధర పడిపోయింది. దీంతో కొనుగోలుదారులు టమాటాల కోసం ఎగబడ్డారు. కాగా బీరకాయలు మాత్రం కిలో రూ.60 ధర పలికింది. ఉల్లిపాయలు రూ.35, బెండకాయలు రూ.40, బంగాళదుంపలు రూ.30, దొండకాయలు రూ.40, దోసకాయలు రూ.40, వంకాయలు (నలుపు) రూ.60, తెల్ల వంకాయలు రూ.80, చిక్కుడు రూ.100, కాకరకాయలు రూ.60, అల్లం కేజీ రూ.150 చొప్పున విక్రయించారు.

సంధ్యారాణి హత్యకు నిరసనగా కొవ్వొత్తుల ప్రదర్శన



ఆకివీడులో కొవ్వొత్తులతో ప్రదర్శన చేస్తున్న దృశ్యం

ఆకివీడు: ప్రేమించి, పెళ్లి చేసుకున్న భార్యను అత్యంత కిరాతకంగా చంపిన వాడపల్లి రాంబాబును ఉరి తీయాలని అఖిలపక్షం ఆధ్వర్యంలో మహిళలు, వివిధ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక దుంపగడప గేటు వద్ద నుంచి మహిళలు, వివిధ పార్టీల నాయకులు కొవ్వొత్తులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైఎస్సార్ సెంటర్‌లో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి మాట్లాడుతూ అతి కిరాతకంగా భార్య సంధ్యను చంపిన హంతకుడు రాంబాబును ఉరి తీయాలని ఆమె డిమాండ్ చేశారు. వారి కుటుంబానికి అండగా ఉండాలని, న్యాయం జరిగే వరకూ పోరాడాలని సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతి, పుప్పాల పండు, ఎండీ మస్తాన్‌వలీ, షేక్ హుస్సేన్, గుండా సుందరరామనాయుడు, ఎండీ మాబూ, రంభ శివ, సీపీఎం నాయకులు కె.తవిటినాయుడు, బొక్కా వర్మ, డోకల సత్యవతి, సందక సూర్యకుమారి, డోకల రవితేజ, రాంబాబు, ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు, మహిళలు అధిక సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.

22వ వార్డులో మావుళ్లమ్మ జాతర ప్రారంభం



అమ్మవారి జాతరను ప్రారంభిస్తున్న గ్రంధి రవితేజ

భీమవరం (ప్రకాశంచౌక్): సమాజంలో ప్రతి ఒక్కరు భక్తిభావంతో మెలిగినప్పుడే సమాజంలో శాంతి నెలకొంటుందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువత నాయకులు, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తనయుడు రవితేజ అన్నారు. శ్రావణమాసం సందర్భంగా పట్టణంలోని 22వ వార్డులో ఆదివారం శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి జాతరను రవితేజ ప్రారంభించారు. ముందుగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రావణమాసంలో శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి జాతరను పట్టణంలో వాడవాడలా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి కరుకు పోతురాజు, బూది శ్రీను, మోది అప్పారావు, అమ్మాణి కృష్ణ, కరుకు ఏడుకొండలు, కొక్కురి గురుమూర్తి, లీల,మద్దాల సత్యనారాయణ, అడబాల పవన్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు ఉద్యోగాల కోసం కసరత్తు



నరసాపురంలో శిక్షణ పొందుతున్న ఎస్సై అభ్యర్థులు

నరసాపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం పోలీసు శాఖలో ఎస్సై, కానిస్టేబుల్ పోస్టుల నియామకాలకు సంబంధించిన పక్రియ వేగవంతంగా నిర్వహిస్తోంది. ఇప్పటికే కానిస్టేబుల్, ఎస్సై రాత పరీక్షలకు సంబంధించిన తొలి విడత రాత పరీక్ష నిర్వహించింది. ఈ రాత పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థుల్లో ఎస్సై అభ్యర్థులకు సంబంధించి ఈ నెల 25 నుంచి ఈవెంట్స్ సెలక్షన్స్ ను నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో గత కొంత కాలంగా క్రీడా మైదానాల్లో ఆయా అభ్యర్థులు ప్రాక్టీస్‌ను వేగవంతం చేశారు. నరసాపురం వైఎన్ కళాశాల క్రీడా ప్రాంగణలో పోలీసు ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న సుమారు 50 మంది అభ్యర్థులు శిక్షణ తీసుకుంటున్నారు. మొగల్తూరు మండలానికి చెందిన ఓ నేషనల్ అథ్లెట్ మణికంఠ నేతృత్వంలో వీరంతా వారికి అవసరమైన వివిధ అంశాలపై శిక్షణను తీసుకుంటున్నారు. వీరిలో పట్టభద్రులైన యువకులతోపాటు ప్రస్తుతం పోలీస్ శాఖలో పనిచేస్తున్న వారు, మహిళలు సైతం ఉన్నారు. సుమారు నెల రోజులుగా ఉదయం సాయంత్రం వేళల్లో క్రీడా ప్రాంగణమంతా వీరి ప్రాక్టీస్‌తో సందడి నెలకొంది.

మాదిగలు హైదరాబాద్‌కు తరలిరావాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎస్సీ వర్గీకరణ సాధన కోసం మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు 'హలో మాదిగ ఛలో హైదరాబాద్' కార్యక్రమానికి మాదిగ కులస్తులు తరలి రావాలని సోషలిస్ట్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి, తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌చార్జి విస్సంపల్లి సిద్దు మాదిగ కోరారు. పట్టణంలో ఏర్పాటు చేసిన ఎంఆర్‌పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ లక్ష్యసాధన కోసం లక్షలాది మందితో త్వరలో సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభకు వేల సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. కొల్లి రాజశేఖర్, దూలపల్లి శ్రీనివాసరావు, వాసు, చిన్ని పాల్గొన్నారు.


6న పాలకొల్లులో శ్రీకృష్ణాష్టమి వేడుకలు



కరపత్రాన్ని విడుదల చేసిన మేకా శేషుబాబు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక కెనాల్ రోడ్డు ఎర్రవంతెన వద్ద కొలువై ఉన్న శ్రీ కృష్ణ ఆలయంలో సెప్టెంబర్ 6న శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు చేతులమీదుగా స్వామివారి ఉత్సవ కరపత్రాలను విడుదల చేశారు. శేషుబాబు మాట్లాడుతూ శ్రీకృష్ణ ఆలయం నూతనంగా నిర్మాణం చేసిన నాటి నుంచి స్వామివారి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారన్నారు. ప్రతీ నెలా స్వామివారి జన్మనక్షత్రం రోజున అభిషేకాలు, కృష్ణాష్టమి వంటి ఉత్సవాలు నిర్వహిస్తూ ప్రజల్లో ఆధ్యాత్మికత పెంపొందిస్తుండడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు మన్నే శ్రీనివాస్, సెక్రటరీ ఇయ్యపు భాస్కరరావు, ట్రెజరర్ ముగడ శ్రీనివాస్, వైఎస్సార్‌పార్టీ నాయకులు పెచ్చెట్టి కోటేశ్వరరావు, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ 1 విజేత అభిషేక్‌కు సత్కారం



అభిషేక్‌కు కేక్ తినిపిస్తున్న తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: నేటి యువతరం అంతా సాఫ్ట్‌వేర్ రంగాన్నే ఎన్నుకుంటున్నా అభిషేక్ మాత్రం గ్రూప్స్‌కు ప్రిపేరై విజయం సాధించడం మన క్షీరపురికే గర్వకారణమని వైఎస్సార్ పార్టీ చింతలపూడి నియోజకవర్గ పరిశీలకులు గుణ్ణం నాగబాబు అన్నారు. ఆదివారం స్థానిక అచ్చుగట్లపాలెం ప్రజలు గ్రూప్ 1 విజేత రావూరి రామ వెంకట సదాసాయి అభిషేక్‌కు అభినందన సభ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ పాలకొల్లు పట్టణంలో ఇప్పటివరకూ గ్రూప్ 1లో విజయం సాధించిన వ్యక్తి అభిషేక్ కావడం అభినందనీయమని అన్నారు. పాలకొల్లుకు సినీ, నాటక రంగాల్లో జాతీయ స్థాయిలో గుర్తింపు ఉందని అన్నారు. ఏపి పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా అభిషేక్ పాలకొల్లుకు మరోసారి రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకువచ్చారన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు అభిషేక్‌ను, అతని తల్లిదండ్రులు రావూరి చాచా, శ్రీదేవిలను అభినందించారు. అనంతరం అభిషేక్‌ను ఘనంగా సన్మానించి కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవిందరాజులు, చేగొండి సూర్య ప్రకాష్, చేగొండి సూరిబాబు, కుంపట్ల చిన్నరాజా, బొర్రా శ్రీనివాసు, మండెల రజని, వంగా నరసింహరావు, కత్తుల రామ్మోహనరావు, అడ్డాల వాసు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆకివీడులో గడపగడపకు మన ప్రభుత్వం

ఆకివీడు: ఆకివీడులోని మూడో నంబర్ సచివాలయం పరిధిలోని ఒకటో వార్డులో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ కృష్ణమోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, కౌన్సిలర్లు పాల్గొంటారని తెలిపారు. ఆయా సచివాలయ పరిధిలోని సిబ్బంది, వలంటీర్లు, నగర పంచాయతీ వివిధ విభాగాల అధికారులు హాజరుకావాలని ఆయన సూచించారు.

తప్పిన ప్రమాదం

ఆకివీడు: స్థానిక ప్రధాన సెంటర్‌లో విద్యుత్ మెయిన్ వైరు (కండక్టర్)పై వైరు తెగి పడింది. సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫీజు కట్ అయి పెద్ద శబ్దం రావడంతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అదే ప్రాంతంలో జనం రద్దీగా ఉంది. సిబ్బంది విద్యుత్ తీగలను సరిచేసి సుమారు రెండు గంటల తరువాత విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

ఇరువర్గాలపై కేసుల నమోదు

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం కుటుంబ కలహాలతో కొట్లాడుకోవడంతో ఒకరిపై మరొకరు పరస్పరం ఫిర్యాదు చేసుకోవడంతో పోలీసులు ఇరువర్గాలపై కేసులు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. గొల్లవానితిప్ప గ్రామానికి చెందిన మద్ది విజయలక్ష్మికి నలుగురు కొడుకులు ఉండగా వారందరికీ వివాహాలయ్యాయి. ఇంట్లో నాలుగు పోర్షన్లలో ఉండగా వాటికి ఒకే బాత్‌రూమ్ ఉంది. దీంతో పెద్దకుమారుడు మద్ది విజయ శేఖర్ పిల్లలు బాత్‌రూమ్‌లోకి వెళ్లగా ఎంతసేపటికి రాకపోవడంతో మద్ది వేణుగోపాల్ వారిపై కేకలు వేసి చీపురు కట్టతో మద్ది విజయలక్ష్మిని కొట్టి గాయపరిచాడని ఆమె ఫిర్యాదు చేసింది. మద్ది చంద్రకళను అన్యాయంగా మద్ది విజయ శేఖర్ కొట్టి గాయపరిచాడని ఇద్దరూ ఒకరిపై మరొకరు పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. ఇరువర్గాల ఫిర్యాదులపై ఎస్సై బి.మోహన్‌రావు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధులకు వైద్యసేవలు

తణుకు టౌన్: పట్టణంలోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యాన ప్రతి ఆదివారం నిర్వహించే సంచార వైద్యశాల ద్వారా 42 మంది వృద్ధులకు ఉచితంగా వైద్యసేవలు అందించినట్లు అసోసియేషన్ కార్యదర్శి కేవీ సత్యనారాయణ తెలిపారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ తణుకు పట్టణం, పరిసర గ్రామాల పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించి ఇంటి నుంచి బయటకు రాలేని వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. అసోసియేషన్ సభ్యుడు పైడిపర్రుకు చెందిన దాత అనుమోలు సుబ్బారావు ఆర్థిక సహకారంతో ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి ఆర్జి భాస్కరరావు, నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

షుగర్ నిర్ధారణ పరీక్షలు

సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన ప్రతి నెలా మూడో ఆదివారం చేపట్టే ఉచిత షుగర్ వ్యాధి నిర్ధారణ పరీక్షల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరంలో 40 మందికి పరీక్షలు చేసి సలహాలు, సూచనలు ఇచ్చినట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో సభ్యుడు ఐ.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేపు జానపద కళా ఉత్సవాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని బీవీఆర్ కళా కేంద్రం ఆధ్వర్యాన మంగళవారం సాయంత్రం 6.30 గంటలకు జానపద కళా ఉత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కళా కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షుడు బుద్దాల వెంకట రామారావు ఆదివారం తెలిపారు. జానపద నృత్యాలు, కోలాట బృందాలు, గరగల నృత్యాలను కళాకారులు ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వాసవి ఆలయంలో లక్ష్మీగణపతికి ప్రత్యేక పూజలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ పంచాయతన క్షేత్రంలో శ్రావణ మాసం శుద్ధ చవితి పురస్కరించుకుని ఆదివారం విఘ్నేశ్వర పూజ, మహాన్యాసం అనంతరం లక్ష్మీగణపతికి పంచామృతాలు, ఫలరసాలతో అభిషేకాలు, అలంకరణలు జరిగాయి. ఆర్యవైశ్య సంఘం కోశాధికారి నున్న బాల త్రిపుర సుందరరావు, పూర్వాధ్యక్షుడు పేరూరి కాశయ్య, ఆలయ కార్యదర్శి కురిసేటి శ్యాం గుప్తా పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు. ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.